క్లుప్తంగా

నేడు మున్సిపల్ ఉద్యోగుల ధర్నా

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఫెడరేషన్ రాష్ట్ర పిలుపులో భాగంగా ఈ నెల 8న ఉదయం 10 గంటలకు మున్సిపల్ ఆఫీసు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు నేడు 5, 6 సర్కిల్స్‌లో ప్రచారం చేశారు. మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, ఏలూరు నగర ఉపాధ్యక్షుడు పంతం చిన్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి ఖండన



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవిప్రకాష్

ఏలూరు (టూటౌన్): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి కిషోర్ రాకేష్ అనే న్యాయవాది ప్రయత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో రవి ప్రకాష్ మాట్లాడారు. దాడికి ప్రయత్నించిన లాయర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓటు చోరీ దురదృష్టకరం



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ శీలం

ఏలూరు (టూటౌన్): ఓటు భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం అన్నారు. ఓట్లు చోరీ అంశంపై మంగళవారం ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ ఈటా పాలక్ వర్మతో కలిసి శీలం విలేకర్లతో మాట్లాడారు. ఓటు చోరీ కావటం దురదృష్టమన్నారు. పౌరులను చైతన్య పరచి, హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పాలక్ వర్మ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో ఏవిధంగా ఓటు చోరీ జరిగిందో వివరించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం సంతకాల సేకరణ చేశారు.

తూము పూడ్చి వేశారని కేసు నమోదు

పెదపాడు: తమ చెరువు మురుగు తూములో చెత్త, కర్రలు వేసి పూడ్చినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని సత్యవోలు గ్రామానికి చెందిన యలమంచిలి భువనేశ్వరీదేవికి చెందిన చేపల చెరువుకు ఉన్న మురుగు బోదె తూముకు ఇనుపచట్రం వేసి తాళం వేశానని, తాళం పగులకొట్టి సత్యవోలు గ్రామానికి తాటి రంగారావు తూములో చెత్త, కర్రలు వేసి పూడ్చి వేసినట్లు ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో పెదపాడు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



రైతులకు సంఘీభావం తెలుపుతున్న నేతలు

నిడమర్రు: రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బువ్వనపల్లి గ్రామంలో మండల మహాసభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ ట్రంప్ సుంకాల నుంచి ఆక్వా రంగాన్ని కాపాడలన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్నారు.

కాలుష్యం కోరల్లో ఏలూరు

- నిరుపయోగంగా వాటర్ ఫౌంటేన్లు
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.1.16 కోట్లు విడుదల
- ఎన్‌సీఏపీ నిధులతో క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్
- లక్ష్యానికి నేడు తూట్లు

ఏలూరు టౌన్: ఏలూరు నగరం వాతావరణ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. వాతావరణ కాలుష్యం అధికంగా ఉన్న నగరంగా ఏలూరు నిలవటం గమనార్హం. నగరంలో వాయు కాలుష్య నివారణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏఏ)లో భాగంగా ఏలూరులోని పలు ప్రధాన కూడళ్లలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్రం నిధులతో వాటర్ ఫౌంటేన్ల నిర్మాణం చేపట్టారు. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాటర్ ఫౌంటేన్లు నిరుపయోగంగా మారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



జెడ్పీ సమీపంలో కాంతి లేని ఐ లవ్ ఏలూరు వాటర్ ఫౌంటేన్



అశోక్‌నగర్ బ్రిడ్జి వద్ద నిర్మించిన వాటర్ వాల్ ఇలా..

వాయు కాలుష్య నివారణ చర్యలు

ఏలూరు నగరంలో వాయు కాలుష్యాన్ని కొంతమేర తగ్గించేందుకు వైఎస్సార్‌సీపీ హయాంలో చర్యలు చేపట్టారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో కేంద్రం నిధులు మంజూరు చేశారు. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ ఏలూరు నగరానికి రూ.1.16 కోట్లు విడుదల చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏలూరు నగరపాలక సంస్థ అధికారులు నాలుగు చోట్ల వాటర్ ఫౌంటేన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. వాయు కాలుష్యాన్ని నివారించేందుకు నీటి తుంపర్లను గాలిలోకి ఎగిసేలా చేయటం ద్వారా అత్యంత సూక్ష్మంగా ఉన్న రేణువులు గాలిలో ప్రయాణించకుండా అడ్డుకునే అవకాశం ఉందని నిపుణుల సూచనలతో వాటర్ ఫౌంటేన్‌లు నిర్మాణం చేపట్టారు.

లక్ష్యానికి అధికారుల తూట్లు

ఏలూరు జెడ్పీ కార్యాలయం సమీపంలో ఆకర్షణీయంగా నిర్మించిన ఐ లవ్ ఏలూరు, వాటర్ వాల్‌ను రూ.20 లక్షలు వెచ్చించారు. ఒకవైపు ఆహ్లాదం, మరోవైపు పర్యావరణ పరిరక్షణలో భాగంగా, పచ్చటి చెట్లు, పూల మొక్కలతో దీన్ని నిర్మించారు. దీన్ని వైఎస్సార్‌సీపీ హయాంలోనే ప్రారంభించారు.



తంగెళ్లమూడి వంతెన సెంటర్‌లోని వాటర్ వాల్



జూట్ మిల్లు సెంటర్‌లో నిర్మించిన వాటర్ ఫౌంటేన్

జూట్ మిల్లు సెంటర్‌లో రూ.32 లక్షలతో తెలుగు తల్లి విగ్రహంతోపాటు, వాటర్ ఫౌంటేన్ నిర్మించారు. తంగెళ్లమూడి బ్రిడ్జి సెంటర్‌లోనూ రూ.32 లక్షలతో వాటర్ వాల్ ఏర్పాటు చేశారు. అశోక్‌నగర్ బ్రిడ్జి సెంటర్‌లోనూ నాలుగు సింహాలతో కూడిన అశోక్‌చక్రం, వాటర్‌వాల్‌ను రూ.32 లక్షలతో నిర్మించారు. ఈ మూడు ఫౌంటేన్‌ల నిర్మాణాలు తుది దశకు చేరుకునే సరికి ఎన్నికలు రావటంతో కొత్త ప్రభుత్వం పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవాలు చేసింది. ఈ ఫౌంటేన్‌ల శిలాఫలకాలకు పసుపు రంగులు వేసుకోవటంలో ఉన్న శ్రద్ధ, వాటి నిర్వహణపై లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాలుష్యాన్ని నివారించాలి



ఏలూరు నగరంలో కేంద్రం నిధులతో నిర్మించిన వాటర్ ఫౌంటేన్‌లు నిరుపయోగంగా మారాయి. ఏలూరులో వాయు కాలుష్యాన్ని తగ్గించి క్లీన్ ఎయిర్ కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీటిని నిర్మించింది. కానీ ప్రస్తుతం వీటిని పట్టించుకోకపోవటంతో దుమ్ముధూళితో నిండిపోయాయి. ఎంతో ఆహ్లాదకరంగా ఉండే ఐ లవ్ ఏలూరు వాటర్ వాల్ సైతం కళతప్పి చిన్నబోయింది. ఏలూరు జిల్లా ఉన్నతాధికారులు దీనిపై చర్యలు చేపట్టాలి.

– పి.రాజేష్, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు

వాటర్ ఫౌంటేన్ ఎక్కడ?



ఎన్‌సీఏఐ నిధులతో వాటర్ పాల్ నిర్మాణాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జూట్ మిల్లు సెంటర్, తంగెళ్లమూడి సెంటర్, అశోక్‌నగర్ బ్రిడ్జి సెంటర్‌లోని వాటర్ ఫౌంటేన్‌లు ఎన్నికల వల్ల నిలిచిపోగా, కొత్త ప్రభుత్వం నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించారు. అశోక్‌నగర్ బ్రిడ్జి వద్ద వాటర్ ఫౌంటేన్ నిర్మాణం లేకుండా తూతూ మంత్రంగా పూర్తిచేశారు. ప్రజల ఆరోగ్యం కోసం వాయు కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలి.

– ఘంటా రాజేశ్వరరావు, వైఎస్సార్ టీయూసీ, ఏలూరు నగర అధ్యక్షుడు

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వండి

ఉంగుటూరు: చేబ్రోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో నాలుగు రైల్వే స్టేషన్లు ఉన్నాయి. పాస్ ప్యాసింజర్ తప్ప మరే రైలు ఆగడం లేదు. అది కూడా అనుకూలత లేని సమయం. గ్రామీణ ప్రాంత రైల్వే స్టేషన్లు ఒకప్పుడు రద్దీగా ఉండేవి. బ్రిటిష్ కాలం నుంచి ఉంగుటూరు, బాదంపూడి, కైకరం, చేబ్రోలు స్టేషన్లు ఎంతో బిజీగా ఉండేవి. అలాంటి స్టేషన్లు మూసి వేసింది రైల్వే శాఖ. అలంకారప్రాయంగా మాత్రమే దర్శనమిస్తున్నాయి. రైల్వే శాఖకు గ్రామీణ ప్రాంత రైల్వే స్టేషన్లే ఆదాయం అందించాయి. అలాంటిది ఈ స్టేషన్లలో రైళ్లు ఆగక వెలవెలబోతున్నాయి. బాదంపూడి, ఉంగుటూరు, కైకరం స్టేషన్లు మూసివేశారు. అలంకార ప్రాయంగా ఉన్నాయి. చేబ్రోలులో అప్, డౌన్ లైన్‌లో వెళ్లే పాస్ట్ ప్యాసింజర్ ఒకటే ఆగుతుంది. కనీసం ఈ స్టేషన్‌లోనైనా ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని ప్రజలు కోరుతున్నారు. 70 వేల మందికి పైగా ఉన్న ప్రజలకు ప్రయాణ సౌకర్యం లేక 20 కిలో మీటర్ల దూరం ఉన్న తాడేపల్లిగూడెం, 55 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఏలూరు రోడ్డు మార్గంలో చేరుకుని రైలు ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కనీసం రెండు ఎక్స్‌ప్రెస్‌లు అయినా చేబ్రోలులో ఆపించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు ఎంపీలకు విజ్ఞప్తులు చేశారు.



చేబ్రోలు రైల్వే స్టేషన్ ఇదే

ఆశా వర్కర్ల ధర్నా

టి.నరసాపురం: ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో విస్తృత పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఆశా వర్కర్ల సంఘం మండల కమిటీ అధ్యక్షురాలు యలమంచిలి విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలన్నారు. అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, మరణించిన ఆశా వర్కర్లకు దహన సంస్కారాల నిమిత్తం రూ.20 వేలు చెల్లించాలన్నారు. ప్రతి ఒక్కరికీ 5జీ మొబైల్స్, సిమ్‌కార్డులు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలన్నారు. అంతేకాక నాణ్యమైన యూనిఫామ్‌లు, పీహెచ్‌సీకి వెళ్లిన ప్రతి సారి టీఏ, డీఏల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం శిక్షణ పొందిన ఆశాలకు పర్మినెంట్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల అదనపు నియామకాలు ప్రభుత్వమే చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అనుమోలు మురళి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



టి.నరసాపురం: ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

యువతతోనే దేశ సమగ్రాభివృద్ధి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రఘురామకృష్ణరాజు

ఏలూరు (టూటౌన్): యువతతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాలను ఎంచుకుని, ఇష్టంగా చదవాలని సూచించారు. మన దేశం, మన రాష్ట్రం, మన యూనివర్సిటీ పేరిట ఏలూరులో కేఎల్ యూనివర్సిటీ, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, కేఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం రాంబాబు, కేఎల్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్లు బీఎస్‌ఎన్ మూర్తి, హెచ్‌ఎస్‌ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు పొందిన 60 మంది విద్యార్థులకు పతకాలు, జ్ఞాపికలు ఇచ్చి ప్రశంసించారు.

30న భగవద్గీత కంఠస్థ పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డిసెంబర్ 1న గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో నవంబర్ 30న భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్టు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం సోమవారం ఏలూరులో తెలిపారు. నవంబర్ 30న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఉదయం 10 గంటలకు 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు గుణత్రయ విభాగయోగం (14వ అధ్యాయం), 10వ తరగతి, ఇంటర్మీడియట్ వారికి దైవాసుర సంపద్విభాగయోగం (16వ అధ్యాయం)లో పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వారికి నిత్యజీవితంలో భగవద్గీత – భావ విశ్లేషణ అనే అంశంపై పోటీలు నిర్వహించి, ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.1116, రూ.816, రూ.516, మెమొంటో, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్టు వెల్లడించారు.

ఫీజుల పేరుతో ఒత్తిడి చేయవద్దు

ఏలూరు (టూటౌన్): ఫీజుల పేరుతో విద్యార్థులను ఒత్తిడి చేయడం సర్ సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆపాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని డిమాండ్ చేశారు. సర్ సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్, థర్డ్ ఇయర్ విద్యార్థులకు ఇంకా 3వ, 5వ సెమిస్టర్లు మొదలు కాకుండానే పూర్తి సంవత్సరం ఫీజు కట్టమని ఒత్తిడి చేస్తున్నారన్న సమాచారంతో మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌తో మాట్లాడినట్టు నాని తెలిపారు. సంవత్సరం ప్రారంభంలోనే మొత్తం ఫీజు క్లియర్ చేస్తే తప్ప ఇంటర్నల్ ఎగ్జామ్స్ రాయించమని హెచ్చరిస్తూ విద్యార్థులను గందరగోళం గురిచేయడం తగదన్నారు. సగం ఫీజు కట్టిన విద్యార్థులను కూడా పూర్తి ఫీజు కట్టాల్సిందేనని యాజమాన్యం చెప్పడం యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఫీజులు కట్టినా, కట్టకపోయినా ఇంటర్నల్ ఎగ్జామ్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు సీహెచ్ చరణ్, ఆర్ రాజేష్ పాల్గొన్నారు.

మారణ హోమాన్ని నిలుపుదల చేయాలి

జంగారెడ్డిగూడెం: ఇజ్రాయిల్‌లో కొనసాగిస్తున్న మానవ మారణ హోమాన్ని వెంటనే నిలుపుదల చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. పాలస్తీనాలో అమాయక ప్రజలను గత రెండు సంవత్సరాలుగా బాంబులు వేసి చంపేస్తున్న ఇజ్రాయిల్ వైఖరిని ఖండిస్తూ దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు జంగారెడ్డిగూడెం పట్టణంలో సభ నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ధర్ముల సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించి నేటికీ రెండు సంవత్సరాలు పూర్తయిందని, ఈ సమయంలో 70 వేల మంది అమాయక పాలస్తీనా పౌరులను చంపివేశారని, 1.75 లక్షల మంది పాలస్తీనా పౌరులు వికలాంగులయ్యారన్నారు. ఈ దాడుల్లో స్థానిక అంతర్జాతీయ విలేకరులు 273 మంది మృత్యువాత పడ్డారాన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సుధాకర్, ముస్లిం జేఏసీ నాయకులు షేక్ ముస్తఫా, షేక్ నజీర్, అబ్దుల్ షాహి, షేక్ బాజీ (టిప్ టాప్), మహమ్మద్ షహీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దాల ప్రసాద్ పి.శ్రీనివాస్, కారం రాఘవ, కేవీరమణ, ఎం.శ్రీనివాస్, వి.సద్గురు, వి.భారతి, కె.లత, కె.అరుణ, కె.రామలక్ష్మి, కె.పోతిరెడ్డి, టి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లింలు

డ్రగ్స్ వాడకంతో జీవితం నాశనం



మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్ / ఏలూరు (ఆర్ఆర్‌పేట): గంజాయి వాడకం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు ఏర్పడి జీవితం నాశనం అవుతుందని ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు హెచ్చరించారు. మంగళవారం ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో డ్రగ్స్ వద్దు బ్రో పై అవగాహన కార్యక్రమం పోలీసులు, ఈగల్ టీం సభ్యులు నిర్వహించారు. ఈగల్ ఐజీపీ ఆకే రవికృష్ణ, ఎస్పీ కె.ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తతతో ఉండాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఆర్ఎస్ఐ బి.ఉదయభాస్కర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

చింతలపూడి: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా పార్టీని బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మేధావుల విభాగం కార్యదర్శిగా నియమితులైన గోలి చంద్రశేఖర్ రెడ్డిని చింతలపూడి పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల నాగేశ్వరరావు, కె.చండీప్రియ, తుమ్మూరి వెంకటరామిరెడ్డి, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఆతుకూరి సుబ్బారావు, పి.మాధవరెడ్డి, ఎం.ఇమ్మానుయేలు, ఎస్.కాంతారావు, గోలి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాములకు అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీహరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు నిర్వహిస్తున్న అన్నసమారాధన కార్యక్రమం కొనసాగుతుంది. ఆరో రోజు దాతలుగా తూర్పు పిప్పర్రు గ్రామానికి చెందిన తానేటి శ్రీనివాసరావు, సైపురెడ్డి శ్రీనివాస్, వానపల్లి బాలాజీ, సకినాల ఆదినారాయణ వ్యవహరించినట్లు ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లేపర కృష్ణారావు, తమ్మన వెంకటేశ్వరరావు, నెక్కలపాటి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	[illegible]9
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	02
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	02
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	02
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	06
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – తిరుపతి	16.00	4830	27

ఆరోగ్య సిబ్బంది పాత్ర కీలకం

భీమడోలు: వ్యాధులను అరికట్టడంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్ల పాత్ర కీలకమని ఏలూరు జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ వద్ద ఆశాడేను పురస్కరించుకుని మంగళవారం కీటకాల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన సదస్సును నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వాటి నివారణ చర్యలు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. సీహెచ్‌వో ఇందిరాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ మధుబాబు, సిబ్బంది మేకా శ్రీనివాసరావు, చందుకుమార్, ఆరోగ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

10న బహిరంగ వేలం

జంగారెడ్డిగూడెం: ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల పలు ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 15 వాహనాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ నెల 10వ తేదీన బహిరంగ వేలం వేయబడునని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా ధరావతు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ 9618521855, ఎస్సై 9963463363 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం తనిఖీ

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నాటు సారా సంబంధిత సమాచారం సేకరించాలని ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబును ఆదేశించారు. ఎన్‌డీపీ మద్యం, కల్తీ మద్యంపై నిఘా ఉంచాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని తాటియాకుల గూడెం సరిహద్దు చెక్‌పోస్టుకు వెళ్లి తనిఖీలు నిర్వహించి, సిబ్బందికి అక్రమ మద్యం రవాణాపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.

కుల ధ్రువీకరణ పత్రం కోసం దీక్ష

బుట్టాయగూడెం: మండలంలోని అచ్చియ్యపాలేనికి చెందిన కుంజా ప్రణీత్ అనే యువకుడు తన కుటుంబ సభ్యులతో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంజా ప్రణీత్ గత 14 సంవత్సరాలుగా కుల ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా మంజూరు చేయడం లేదని ఆరోపించారు. ఆధార్ కార్డులో కూడా నమోదు కావడం లేదన్నారు. దీంతో ప్రణీత్ అనేక ఇబ్బందులు పడుతున్నానని ఇప్పటికైనా కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరారు. అయితే ఇదే సమస్యపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రణీత్ కుటుంబ సభ్యులు తిరువీధుల విజయరావు, సిరివెన్నెల సూరమ్మ, ఎం.ముసలమ్మ తదితరులు పాల్గొన్నారు.